




మెగా డీఎస్సీకి పచ్చజెండా

- ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు
- పెన్షన్ ఇక నెలకు రూ.4 వేలు
- తెరుచుకోనున్న అన్న క్యాంటీన్లు
- నైపుణ్య గణన షురూ
- సర్వత్రా హర్షం

అదిరిందయ్యా... చంద్రం

బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఫైలుపై తొలి సంతకం చేశారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని ఎన్నికల ముందు హామీ ఇచ్చారు. అన్నట్టే చేశారు. అదేవిధంగా వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అత్యంత ప్రమాదకరమైనదని, దానిని రద్దు చేస్తామన్నారు. ఆ పని కూడా చేసేశారు. రెండో సంతకం దానిపైనే చేశారు. అవ్వ, తాతలకు ప్రస్తుతం నెలకు రూ.3 వేలు వస్తున్న పెన్షన్‌ను జూలై నుంచే రూ.4 వేలు చొప్పున ఇస్తామని చెప్పారు. ఆ ఫైలుపై కూడా సంతకం చేశారు. పేదలకు నామమాత్రపు ధరకే రుచికరమైన భోజనం పెట్టే అన్న క్యాంటీన్లు మళ్లీ తెరిపిస్తామని చెప్పారు. అందుకు సంబంధించిన ఫైలుపై నాలుగో సంతకం చేశారు. నిరుద్యోగ యువత ఎంతమంది ఉన్నారో లెక్కించి, వారికి నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. దీనికోసం శిక్షణకు అర్హులైన వారిని గుర్తించే (స్కిల్ సెన్సస్) ఫైలుపై ఐదో సంతకం చేశారు. నిరుద్యోగ ఉపాధ్యాయులు, రైతులు, పెన్షనర్లు, పేదలు, నిరుద్యోగ యువతకు మేలు జరిగేలా ఒక్క గురువారమే ఐదు ఫైళ్లపై సంతకం చేసి లక్షలాది మందికి ప్రయోజనం కల్పించారు.

అవ్వా తాతల్లో ఆనందం కనిపింఛెన్

పింఛన్ లబ్ధిదారులకు ఇకపై రూ.4 వేలు

- దివ్యాంగులకు రూ.6 వేలు
- పింఛన్ల నగదు పెంపు ఫైలుపై సంతకం చేసిన సీఎం చంద్రబాబు



(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

పేద వర్గాలకు ప్రభుత్వం అందించే సామాజిక పింఛన్ మొత్తం రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలకు పెంచుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం దీనికి సంబంధించిన ఫైలుపై సంతకం చేయడంతో ఆ యా వర్గాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. వచ్చే నెల ఒకటో తేదీన పెంచిన సొమ్ము నాలుగు వేలు అందుకుంటామని సంతోషంతో చెబుతున్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు రూ.రెండు వేలు ఉన్న పింఛన్ జగన్ హయాంలో రూ.మూడు వేలకు చేరుకునేందుకు ఐదేళ్లు పట్టింది.

జిల్లాలో ప్రస్తుతం 2,64,526 మంది 12 రకాల పింఛన్ లబ్ధిదారులున్నారు. భరోసా పింఛన్‌ల పేరుతో వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, మత్స్యకారులు, వితంతువులు, ట్రాన్స్‌జండర్స్, డప్పు కళాకారులు, కళాకారులు లబ్ధి పొందుతున్నారు. వీరికి ప్రతి నెలా రూ.3 వేలు వంతున ప్రభుత్వం రూ.75.86 కోట్లు జిల్లాకు విడుదల చేస్తోంది. ఏప్రిల్ నెల నుంచే రూ.4 వేల పింఛన్ పెంపు అమలు చేస్తే ఒక్కొక్కరికీ రూ.7 వేలు వంతున జూలై 1న అందజేయనున్నారు. జిల్లాలో 31,366 మంది దివ్యాంగులకు నెలకు రూ.3 వేలు పింఛను అందుతోంది. దీన్ని కూటమి ప్రభుత్వం రూ.6 వేలుకు పెంచి జూలై ఒకటో తేదీ నుంచి ఇవ్వనున్నారు. అదనంగా జిల్లాకు ఎంత అవసరమనే దానిపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. అన్ని అర్హతలు ఉన్న లబ్ధిదారులకు పింఛన్‌లు అందనున్నాయి. సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ ప్రకారం భరోసా పింఛన్‌లు పెంచుతూ బాధ్యతలు చేపట్టిన తొలిరోజే సంతకం చేయడంపై పింఛన్‌దారుల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పింఛన్ పెంచడంపై ఆయా వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు



అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛను రూ.4 వేలు చేస్తానని చెప్పిన చంద్రబాబునాయుడు మాట నిలబెట్టుకున్నారు. పెన్షన్ ఒకేసారి వెయ్యి రూపాయలు పెరగడం మాలాంటి వృద్ధులకు ఎంతో ఉపయోగకరం.

\- బళ్ళ కృష్ణ, శ్రీరాంపురం, పాయకరావుపేట మండలం

ఎవరి భూమిపై వారికే హక్కు

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుతో సామాన్యులకు శాశ్వత రక్షణ

- ఆ చట్టం అమలైతే ప్రమాదం ఊహించలేనిది
- పేదల భూములకు రక్షణ లేకుండాపోయేది
- చట్టాన్ని రద్దు చేస్తూ చంద్రబాబు సంతకం చేయడంపై సర్వత్రా హర్షం



చోడవరం, జూన్ 13:

గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేసే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకురావాలని విశ్వప్రయత్నాలు చేసింది. అన్ని వర్గాల ప్రజలు, న్యాయవాదులు వ్యతిరేకిస్తున్నా బలవంతంగా రుద్దాలని ప్రయత్నించింది. తాము అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన ప్రకటించాయి. ఈ మేరకు ఆ చట్టాన్ని రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం దీనికి సంబంధించిన ఫైలుపై సంతకం చేశారు. దీనిపై అన్ని వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

భూమి హక్కుదారులు తమ సొంత భూమిని తమదిగా నిరూపించుకునే హక్కును పూర్తిగా నిర్వీర్యం చేసే విధంగా వైసీపీ ప్రభుత్వం అమలులోనికి తీసుకు వచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుతో ప్రజల్లో ఇంతకాలం రేగుతున్న అలజడికి తెరపడినట్టయింది. భూమి హక్కుదారులు వారి భూములకు సమగ్రంగా రక్షణ కల్పించడంతో పాటు, భవిష్యత్తులో భూములపై ఎలాంటి సమస్యలు లేకుండా ప్రభుత్వం బాధ్యత వహించేలా చూస్తామంటూ వైసీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని తేవడం వివాదాస్పదమైంది. దీనిపై న్యాయవాదులు, సామాన్య ప్రజలు చాలా రోజుల నుంచి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టం వల్ల కలిగే అనర్థాలను గుర్తించిన న్యాయవాదులు ఆరు నెలల నుంచి చేస్తున్న నిరసనను పట్టించుకోకుండా జగన్ ప్రభుత్వం మొండిగా యాక్టు అమలుదిశగా అడుగులు వేసింది. చట్టసభలో ఆమోదించిన ఈ చట్టాన్ని అమలులోకి తెచ్చే సన్నాహాలు చేపట్టడంతో కూటమి పార్టీలు తెలుగుదేశం, జనసేనలు ఈ చట్టం అమలును గట్టిగా వ్యతిరేకించాయి.

ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో చేటు

వైసీపీ ప్రభుత్వం అమలులోకి తీసుకుని వచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టం వ్యవస్థలో తహసీల్దార్, ఆర్‌డీవో, జేసీలు ఎవరూ లేకుండా జిల్లాకు ప్రత్యేకంగా ఒక ల్యాండ్ అప్పిలేటింగ్ అథారిటీ పేరుతో ఒక గ్రూప్ వన్ అధికారిని నియమించడానికి రంగం సిద్ధం చేశారు. ఇక ఇందులో స్థానిక కోర్టులను కూడా పక్కనపెట్టేశారు. జిల్లాలో అప్పిలేటింగ్ అథారిటీ అధికారి చెప్పిందే తుది నిర్ణయంగా నిర్ధారణ చేసేలా వ్యవస్థను రంగంలోకి తెచ్చారు. దీని వల్ల భూ యజమానికి తన భూమిపై హక్కులు కాపాడుకునేందుకు పడాల్సిన కష్టాలు వర్ణనాతీతం అనే చెప్పాలి. జిల్లా అప్పిలేటింగ్ అథారిటీ అధికారిని ప్రభుత్వం నియమించే అవకాశం ఉండడంతో సహజంగానే ఆ అధికారి అధికార పార్టీకి అనుకూలంగానే నిర్ణయాలు వెలువరించే అవకాశం ఉంది. అధికార పార్టీ నాయకుడు సామాన్యుడి భూమిని దౌర్జన్యంగా ఆక్రమిస్తే అప్పిలేటింగ్ అథారిటీ ఆక్రమణదారుడికే అనుకూలంగా నిర్ణయం వెలువరిస్తే, ఆ సామాన్యుడు ఇక హైకోర్టు మినహా స్థానిక కోర్టులను ఆశ్రయించడానికి వీలుండదు. దీని వల్ల డబ్బులున్న వ్యాపారవేత్తలు, రాజకీయనాయకులను ఎదిరించి హైకోర్టు స్థాయిలో కేసు నడిపే స్థోమత సామాన్యులకు లేకపోవడం వల్ల సామాన్యులు తమ భూమిని కోల్పోక తప్పని పరిస్థితి. ఇలాంటి ప్రమాదకర పోకడలు ఈ కొత్త చట్టం ద్వారా అమలుచేసేందుకు ప్రభుత్వం సిద్ధం కావడంతో కూటమిలోని పార్టీలు దీనిని గట్టిగా వ్యతిరేకించింది. ఈ చట్టాన్ని రద్దు చేస్తూ చంద్రబాబునాయుడు గురువారం సంతకం చేయడంపై అన్ని వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

ఆనందంగా ఉంది



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంతకం చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ చట్టం అమలైతే రైతులు చాలా నష్టపోయేవారు. వైసీపీ ప్రభుత్వం ఈ చట్టాన్ని బలవంతంగా రుద్దాలని చూసింది. ఈ చట్టం రద్దు కావడంతో భూములకు రక్షణ కల్పించినట్టయింది.

\- గొర్లి శ్రీనివాసరావు, తుమ్మపాల



నర్సీపట్నంలో నిరుపయోగంగా ఉన్న అన్న క్యాంటీన్ భవనం

పేదలకు ఆకలి బాధలు ఉండవిక

పునఃప్రారంభంకానున్న అన్న క్యాంటీన్లు

- ఎన్నికల హామీని నెరవేర్చనున్న చంద్రబాబు
- ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఫైలుపై సంతకం
- కార్మికులు, కూలీల్లో ఆనందం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లు పునఃప్రారంభంకానున్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక మూతపడిన ఈ క్యాంటీన్లు తిరిగి తెరుచుకోనున్నాయి. ఎన్నికల హామీలో భాగంగా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే గురువారం అన్న క్యాంటీన్లు పునఃప్రారంభించే అంశానికి సంబంధించిన ఫైలుపై సంతకం చేశారు. దీనిపై కార్మికులు, కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలో అనకాపల్లి పట్టణంలోని ఎన్టీఆర్ వైద్యాలయం, భీమునిగుమ్మం జంక్షన్‌లోని రైల్వేస్టేషన్ ప్రధాన మార్గం వద్ద, అలాగే నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల పరిధిలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. గతంలో అన్న క్యాంటీన్‌లలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం రూ.5లు చొప్పున తీసుకొని ఆకలి తీర్చేవారు. కూలీలు, చిరు వ్యాపారులకు ఒక పూట అల్పాహారం, రెండు పూట్ల భోజనం ఖర్చు రూ.15లతో రోజంతా గడిచిపోయేది. విశాఖపట్నం అక్షయపాత్ర సంస్థ ప్రత్యేక వాహనంలో ఆహార పదార్థాలు అన్న క్యాంటీన్లకు పంపించేవారు. నర్సీపట్నం అన్న క్యాంటీన్‌ను 2019 జనవరి 11న అప్పటి ఆర్ అండ్ బీ శాఖా మంత్రి అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. అక్కడ రోజూ అల్పాహారం 350 మందికి, మధ్యాహ్నం భోజనం 350 మందికి, రాత్రి భోజనం 250 మందికి పెట్టేవారు. అన్న క్యాంటీన్ మూత పడే సమయానికి అల్పాహారం చేసిన లబ్ధిదారులు 54,969, మధ్యాహ్న భోజనం చేసినవారు 59,575 మంది, రాత్రి భోజనం చేసిన వారు 34,520 మంది ఉన్నారు. అలాగే అనకాపల్లి పట్టణం ఎన్టీఆర్ వైద్యాలయం, భీమునిగుమ్మం జంక్షన్‌లోని రైల్వేస్టేషన్ ప్రధాన మార్గం వద్ద 2018 జూలై 11న అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌లో ఉదయం ఫలహారం రూ. 5లకు 300 నుంచి 400 మంది తీసుకునేవారు. మధ్యాహ్నం రూ. 5లకు 500 నుంచి 600 మంది భోజనాలు చేయగా, రాత్రి వేళల్లో 300 నుంచి 400 మంది భోజనాలు చేసేవారు. భీమునిగుమ్మం జంక్షన్ వద్ద గల అన్న క్యాంటీన్ వద్ద రోజుకు వెయ్యి మంది వరకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు చేసేవారు. ఎన్టీఆర్ వైద్యాలయం వద్ద వైద్యాలయానికి వచ్చే రోగులతో పాటు సహాయకులకు సమీపంలోని కూరగాయలు, అరటిపండ్లు, కొబ్బరికాయల మార్కెట్‌ల్లో పనిచేసే కార్మికులకు ఆ పరిసరాల పేదలకు ఎంతో అందుబాటులో ఉండేది. భీమునిగుమ్మం జంక్షన్‌లోని క్యాంటీన్ రిక్షా కార్మికులకు, భవన నిర్మాణ కార్మికులకు, రైల్వేస్టేషన్ మీదుగా పొరుగు జిల్లాలకు పనులకు వెళ్లే వ్యవసాయ కూలీలకు ఎంతో అందుబాటులో ఉండేవి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది ఆగస్టులో ఈ క్యాంటీన్లు మూసివేసింది. అప్పటి నుంచి ఈ ఐదేళ్లు అన్న క్యాంటీన్ భవనాలు దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయి. ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధిలో కొమ్మాయమ్మ గుండం వీధిలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ మూత పడింది. ప్రస్తుతం ఈ భవనంలో గ్రామ సచివాలయం నడుపుతున్నారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లను తిరిగి తెరిపించి పేదల కడుపు నింపుతామని కూటమి నాయకులు ఇచ్చిన హామీ ప్రకారం సీఎం చంద్రబాబునాయుడు గురువారం బాధ్యతలు చేపట్టిన వెంటనే అన్న క్యాంటీన్‌ల పునఃప్రారంభోత్సవ ఫైలుపై సంతకం చేశారు. ఐదేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వం మూసేసిన అన్న క్యాంటీన్లు తెరుచుకోనుండడంపై పేదలు, ముఖ్యంగా చిరు వ్యాపారులు, ఇతర ప్రాంతాల నుంచి వైద్యం కోసం పట్టణాలకు వచ్చేవారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మా ఆకలి బాధలు తీరతాయి



గత ఐదేళ్లుగా అర్ధాకలితో అలమటించాం. ఒక పక్క పనులు లేక, మరో వైపు కుటుంబాన్ని పోషించడం లేక ఇబ్బంది పడ్డాను. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మళ్లీ అన్న క్యాంటీన్లు పునఃప్రారంభిస్తూ సంతకం చేశారని తెలిసి మా కుటుంబం ఎంతో ఆనందించింది. ఇకపై మాకు ఆకలి బాధలు ఉండవు.

\- గొడ్డి లోవరాజు, రిక్షా కార్మికుడు, కృష్ణాపురం కాలనీ, కొత్తూరు

నేటి అర్ధరాత్రి నుంచి చేపల వేట

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి)

సముద్రంలో చేపల వేటకు మత్స్యకారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి వేటకు బయలుదేరి వెళ్లనున్నారు. కేంద్ర ప్రభుత్వం ఏటా ఏప్రిల్ 15 నుంచి రెండు నెలలు వేట నిషేధిస్తుంది. ఆ గడువు శుక్రవారంతో ముగుస్తుంది. కాగా, ఈసారి సీజన్ బాగుండాలని మత్స్యకారులు గంగమ్మకు మొక్కులు సమర్పించుకుని బోట్లను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ సీజన్‌లో తొలి మూడు నెలలు రొయ్యలే ఎక్కువగా పడతాయి. కొంచెం వర్షాలు పడితే సముద్రంలో చేరే కొత్తనీటికి రొయ్యలు పైకి వచ్చి వలలకు చిక్కుతాయి. వారం నుంచి రెండు వారాలు సముద్రంలో తిరిగితే తప్ప గిట్టుబాటు అయ్యే సరకు దొరకదు. సముద్రంలో రెండు వారాలు వేట సాగించాలంటే డీజిల్, ఇతర సరకులు, గ్యాస్, ఐస్ తదితరాలకు రూ.4 లక్షల వరకు వ్యయం అవుతుంది. వేట నుంచి వచ్చాక రొయ్యలు, చేపలు అమ్మగా వచ్చే మొత్తంలో పెట్టుబడి రూ.4 లక్షలు తీయగా మిగిలేదే లాభం. అందులో కూడా కలాసీలకు రెండు వారాల జీతం ఇవ్వాల్సి ఉంటుంది. అంటే వేటకు వెళితే రూ.5 లక్షల విలువైన మత్స్య సంపదతో రావాలి. అంతకంటే తక్కువ వస్తే నష్టమే. అయితే రెండు నెలలు ఎవరూ వేటకు వెళ్లకపోవడం వల్ల సముద్రంలో మత్స్య సంపద బాగానే లభిస్తుంది. దానికి కాసిన్ని వర్షాలు కురిస్తే పంట పండినట్టే.

సాగునీటికి ఎదురుచూపులు

గత ప్రభుత్వ నిర్లక్ష్యం... రైతులకు శాపం

- మరమ్మతులకు నోచుకోని సాగునీటి వనరులు
- ఐదేళ్లుగా వర్షాలపైనే ఆధారం
- కూటమి అధికారంలోకి రావడంతో చిగురించిన ఆశలు



తూటిపాలలో వృథాగా ఉన్న ఉన్న గ్రోయిన్

మాకవరపాలెం, జూన్ 13:

వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగునీటి ప్రాజెక్టులు పూర్తిగా నిరుపయోగంగా మారాయి. మాకవరపాలెం, పి.తూటిపాల, కె.తూటిపాల, మామిడిపాలెం, చినరాచపల్లి గ్రామాల్లోని సాగునీటి ప్రాజెక్టులు అధ్వానంగా మారడంతో రైతులు వర్షాధారంపైనే పంటలు సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖరీఫ్‌లోనూ పూర్తిస్థాయిలో పంటలు పండని పరిస్థితి నెలకొంది. ఆయా ప్రాజెక్టులకు మరమ్మతులు చేపట్టాలని అన్నదాతలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతి పత్రాలు అందజేశారు. తూటిపాల వద్ద సర్పానదిలో ఉన్న గ్రోయిన్ నీటి ఉధృతికి కొట్టుకుపోయి ఐదేళ్లవుతున్నా నేటికీ పునరుద్ధరణ పనులు చేపట్టలేదు. దీంతో సుమారు 400 ఎకరాల సాగు భూమికి నీరందని పరిస్థితి నెలకొంది.



గేట్లు మరమ్మతులకు గురికావడంతో వృథాగా ఉన్న మాకవరపాలెం మెరకకాలువ

ఎన్నికల సమయంలో హడావిడి

సాగునీటి ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువస్తామని గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా వైసీపీ నాయకులు ప్రకటనలు చేశారు. ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ పనులు చేపట్టలేదు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్ సాగుకు నీరందే అవకాశాలు కనిపించడం లేదు. మాకవరపాలెంలో సర్పానది నుంచి మెరక కాలువకు సాగునీరు సరఫరా జరుగుతుంది. రెండేళ్లుగా సాగునీటి కాలువ గేట్లు పాడైపోవడంతో వర్షాధారంపైనే వరి సాగు చేస్తున్నారు. మరమ్మతులు చేపట్టకపోవడంతో సుమారు 500 ఎకరాలకు సాగునీరు అందని పరిస్థితి. మామిడిపాలెం రిజర్వాయర్‌లో పూడిక పెరిగిపోవడం, గేట్లు మరమ్మతులకు గురవడంతో రిజర్వాయరులో చుక్క నీరు నిల్వ ఉండడం లేదని ... మిగతా 8వ పేజీలో

మెగా డీఎస్సీపై సంతకం

నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో హర్షం

- రాష్ట్రవ్యాప్తంగా 16,347 పోస్టులు భర్తీ
- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పోస్టుల ఖాళీలపై అధికారుల కసరత్తు
- రెండు, మూడు రోజుల్లో స్పష్టత



ప్లకార్డులతో సీఎంకు అభినందనలు తెలియజేస్తున్న నిరుద్యోగులు

విశాఖపట్నం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి):

మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే (గురువారం) నారా చంద్రబాబునాయుడు సంతకం చేయడంతో నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో ఆనందం వెల్లివిరిసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాలుగున్నరేళ్లపాటు డీఎస్సీ ఊసే లేదు. నిరుద్యోగుల్లో అసంతృప్తిని గ్రహించి ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గత ఏడాది డిసెంబరులో టీచర్ల నియామకాలకు నోటిఫికేషన్ జారీచేసింది. అది కూడా సవ్యంగా ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబునాయుడు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి సంతకం మెగా డీఎస్సీపై చేశారు. రాష్ట్రం మొత్తం మీద 16,347 పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించారు. అయితే ఉమ్మడి విశాఖ జిల్లాలో పోస్టులపై ఇంకా స్పష్టత రావలసి ఉంది. ఉపాధ్యాయులు, పాఠశాలల హేతుబద్ధీకరణ కోసం జారీచేసిన జీవో 117 రద్దు లేదా సవరించిన తరువాత జిల్లాలో ... మిగతా 8వ పేజీలో

మా కల నెరవేరింది



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెగా డీఎస్సీపై తొలి సంతకం చేయడం ఆనందంగా ఉంది. బీఈడీ చదివి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న మాలాంటి వారి కల నెరవేరింది. గత ఐదేళ్లుగా నోటిఫికేషన్ కోసం ఎదురుచూసినా ఫలితం లేకపోయింది. ఇప్పుడు మాకు ఎంతో మేలు జరగనుంది.

\- ఎస్.విజయభాస్కర్, శ్రీరామనగర్‌కాలనీ, బీఈడీ విద్యార్థి

హామీల అమలు చరిత్రాత్మకం

చంద్రబాబుపై ప్రశంసల వర్షం

తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా నాలుగోసారి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు తొలి సంతకం మెగా డీఎస్సీ ఫైల్‌పై చేశారు. రెండో సంతకం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు ఫైల్‌పై చేశారు. మూడో సంతకం నెలకు నాలుగు వేలు పింఛన్ పెంచిన ఫైల్‌పై చేశారు. నాలుగో సంతకం అన్న క్యాంటీన్లు పునః ప్రారంభంపై చేశారు. ఐదో సంతకం నైపుణ్య గణన ఫైల్‌పై చేశారు. ఈ నిర్ణయాలను జిల్లా ప్రజానీకం స్వాగతించింది. ఇది ప్రజా ప్రభుత్వం అని శ్లాఘిస్తున్నది.

కార్మికులు, బలహీన వర్గాలకు ఎంతో మేలు



తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజే అన్న క్యాంటీన్లు పునరుద్ధరణకు చర్యలు చేపట్టడం మాలాంటి రిక్షా కార్మికులకు ఎంతో మేలు జరుగుతుంది. వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీళ్లను నిలిపివేయడం వల్ల మాలాంటి కార్మికులు, బడుగు, బలహీన వర్గాలకు రూ. 5లకు భోజనం కరువైంది. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి అన్న క్యాంటీన్లను తెరిచేందుకు చర్యలు తీసుకోవడం చాలా ఆనందంగా ఉంది.

- **ఎన్.అప్పారావు**, మార్టూరు, అనకాపల్లి మండలం

అన్న క్యాంటీన్‌లు తిరిగి ప్రారంభిస్తుండడంపై హర్షం



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్న క్యాంటీన్‌లను తిరిగి ప్రారంభిస్తామని ప్రకటించడం చారిత్రాత్మకం. లక్షలాది మంది ప్రజలకు రుచికరమైన ఆహారం అందించడం చరిత్రలో నిలిచిపోతుంది. ఏటికొప్పాక నుంచి ఎలమంచిలికి వివిధ పనులపై వెళ్లిన వారంతా అన్న క్యాంటీన్‌ను ఆశ్రయించేవారం. రుచికరంగా ఉండే భోజనాన్ని అందించేవారు. తిరిగి పునః ప్రారంభించడానికి చంద్రబాబు ముందుకు రావడం ఆనందదాయకం.

- **పీలా రమణమ్మ**, గృహిణి, ఏటికొప్పాక

అన్న క్యాంటీన్లు మాకెంతో ఉపయోగకరం



అన్న క్యాంటీన్లు పునరుద్ధరించడం మాకెంతో ఉపయోగకరంగా ఉంటాయి. ఎందుకంటే నేను రిక్షా కార్మికుడుని. ఉదయం 7 గంటలకు వస్తేనే గాని బేరాలు ఏమీ ఉండవు. అలా వచ్చిన తర్వాత సాయంత్రం వరకు విధి నిర్వహణలో ఉంటాను. ఆ సమయంలో బయటే భోజనం చేసేవాడిని. రోజుకు రూ.200 వరకు తిండి నిమిత్తం ఖర్చు అయ్యేది. ఇప్పుడు 5 రూపాయలు ఖర్చు పెడితే మంచి భోజనం దొరుకుతుంది. మాకెంతో ఉపయోగకరంగా ఉంటుంది.

- **పూడి రామారావు**, రిక్షా కార్మికుడు, డీబీ కాలనీ, సత్యనారాయణపురం

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుతో ఉపశమనం



కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయడంతో ఉపశమనం కలిగింది. తాతలు, తండ్రుల నాటి ఆస్తులపై నాయకుల ఫొటోలు, పెత్తనాలపై కుటుంబంలో ఆందోళనలు తలెత్తాయి. ఏళ్ల తరబడి కాపాడుకుంటున్న ఆస్తులను పోగొట్టుకోవాల్సి వస్తుందన్న భయాందోళనలను సైతం అలుముకున్నాయి. భవిష్యత్తులో ఆస్తులు అమ్ముకోవాలన్నా, కొనుక్కోవాలన్నా ప్రభుత్వం అనుమతి తీసుకోవాలన్న వాదన మమ్మల్ని ఎంతగానో కలవరపరిచింది. అయితే టీడీపీ ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దుపై తీసుకున్న నిర్ణయంపై మా ఇంటిల్లాపాది ఆనందం వ్యక్తం చేస్తున్నాం.

- **సందిన చినబాబు**, తుమ్మపాల

పింఛన్ రూ.4 వేలకు పెంచడం శుభపరిణామం



తెలుగుదేశం ప్రభుత్వం ప్రతి నెలా ఇచ్చే సామాజిక పింఛన్ రూ.3 వేలు నుంచి రూ. 4వేలుకు పెంచడం శుభపరిణామం. ఎన్నికల్లో ఇచ్చి హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పింఛన్ రూ. 4వేలుకు పెంచుతూ ఆదేశాలు జారీ చేయడం చాలా ఆనందంగా ఉంది. మాలాంటి వృద్ధులకు ఎంతో సంతోషంగా ఉంటుంది.

- **కశింకోట అప్పారావు**, రజకుడు, అనకాపల్లి.

నిరుద్యోగులకు భరోసా



మెగా డీఎస్సీపై సీఎం చంద్రబాబు సంతకం చేయడం నిరుద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపే నిర్ణయంగా భావిస్తున్నాం. ఇంతకాలం వంచనకు గురై జీవితంపై ఆశలు కోల్పోతున్న నిరుద్యోగులకు మెగా డీఎస్సీతో భరోసా దక్కినట్టయింది. ఉద్యోగాల కోసం పోరాటం చేస్తున్న మాకు ప్రభుత్వ నిర్ణయం ఆశలు నింపింది. కూటమి ప్రభుత్వానికి మా నిరుద్యోగుల తరపున ధన్యవాదాలు.

- **పుల్లేటి గణేష్**, అధ్యక్షులు, ఉత్తరాంధ్ర నిరుద్యోగుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ, చోడవరం

మా భూమి మాదేనన్న నమ్మకం వచ్చింది



ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో మా భూములు మావే అన్న నమ్మకం వచ్చింది. ఇంతకాలం ల్యాండ్ టైటిలింగ్ యాక్టుతో ఏం జరుగుతుందోనన్న ఆందోళనతో ఉన్నాం. చట్టాన్ని రద్దు చేస్తూ తీసుకున్న ఈ నిర్ణయంతో మా పిల్లల భవిష్యత్‌పై ఆందోళన తొలగింది. చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటాం.

- **దేవరపల్లి వెంకట అప్పారావు**, సకురువీధి, చోడవరం

కడుపు నిండా ఆహారం దొరుకుతుంది..



అన్న క్యాంటీన్‌లు మళ్లీ ప్రారంభించడం మాలాంటి చిరు వ్యాపారులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. రూ. 5లకే రుచికరమైన భోజనం అందించే ఈ మహోత్తర పథకం తిరిగి ప్రారంభించడం చాలా ఆనందంగా ఉంది. ఎలమంచిలికి వివిధ పనులపై వచ్చే నాలాంటి చిరు వ్యాపారులకు అన్న క్యాంటీన్‌లు ఎంతో ఉపయోగకరం.

- **కె.నాగేశ్వరరావు**, ధర్మవరం, ఎస్.రాయవరం మండలం

లాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు హర్షణీయం



వంశపారంపర్యంగా లభించిన భూములు, కొనుగోలు చేసిన భూములపై ముఖ్యమంత్రి ఫొటో ముద్రించడం వల్ల ప్రజల్లో అభద్రతా భావం పెరిగిపోయింది. ఇది చాలా తప్పు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ మంచిది కాదు. మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం కొత్తగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన చంద్రబాబునాయుడు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేస్తూ రెండో సంతకం చేయడం చాలా శుభపరిణామం. హర్షణీయం.

- **కర్రి ఆంజనేయులు**, అడ్వకేట్, నక్కపల్లి

క్రైం... crime news

గంజాయి రవాణా కేసులో నిందితులకు పదేళ్ల కారాగార శిక్ష

» రూ.లక్ష జరిమానా

చోడవరం, జూన్ 13: గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో ఇద్దరు నిందితులకు పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ స్థానిక తొమ్మిదో అదనపు జిల్లా కోర్టు జడ్జి గురువారం తీర్పు ఇచ్చినట్టు జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆయన అందించిన వివరాలివి. చీడికాడ మండలం బైలపూడి గ్రామానికి చెందిన జాజిమొగ్గల అప్పారావు, జాజి మొగ్గల అర్జునలు 2015వ సంవత్సరం అక్టోబరు మూడో తేదీ తెల్లవారుజామున రెండు గోనె సంచులతో 32 కిలోల గంజాయిని తరలించేందుకు వారి సొంత గ్రామం బైలపూడి వద్ద వాహనం కోసం ఎదురు చూస్తున్నారు. ఆ సమయంలో అప్పటి చీడికాడ ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు సిబ్బందితో కలిసి నిందితులను ఇద్దరినీ పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. నిందితులపై నమోదైన కేసుకు సంబంధించి నేరం రుజువు కావడంతో గురువారం జిల్లా జడ్జి వారిద్దరికీ పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. లక్ష రూపాయల జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాది సాధారణ జైలు శిక్ష అనుభవించవలసి ఉంటుందని తీర్పులో వెల్లడించారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో అడిషనల్ ప్రభుత్వ పీపీ వెంకటరావు వాదనలను సమర్థించిన జడ్జి నిందితులకు జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. కాగా, ఈ కేసును సమర్థంగా పర్యవేక్షించడంతో పాటు, సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టి నిందితులకు శిక్ష పడడంలో కృషిచేసిన చీడికాడ పోలీసులను, దర్యాప్తు చేసిన అధికారులను ఎస్పీ మురళీకృష్ణ అభినందించారు.

ఇంటర్‌నెట్ సెంటర్‌లో అగ్నిప్రమాదం



దుకాణంలో వ్యాపించిన మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఎలమంచిలి, జూన్ 13: పట్టణంలోని ఎస్‌బీఐ సమీపంలో ప్రధాన రోడ్డు పక్కన ఓ ఇంటర్నెట్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం రాత్రి 11 గంటల తర్వాత అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.4 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్టు అగ్నిమాపక అధికారి రాంబాబు తెలిపారు. దుకాణ యజమాని వెంకట్రావు బుధవారం రాత్రి ఎప్పటిలాగానే దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లిపోయాడు. తర్వాత దుకాణంలో మంటలు వస్తున్నాయని ఎవరో ఫోన్ చేయడంతో వెంకటరావు వచ్చారు. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేయడంతో వారు హుటాహుటిన వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే జెరాక్స్, లామినేషన్ మిషన్లు, ఫ్రిజ్, ఇతర వస్తు సామగ్రి మంటల్లో కాలిపోయాయి. యజమానికి ఇదే ప్రధాన జీవనాధారం. తనను ఆదుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన భారీ కంటైనర్

» రహదారిపై తెగిపడిన విద్యుత్ వైర్లు

» ట్రాఫిక్‌కు అంతరాయం... » ఊటగెడ్డ జంక్షన్‌లో ఘటన



రహదారిపై తెగిపడిన విద్యుత్ వైర్లు

పరవాడ, జూన్ 13 : అదుపుతప్పి భారీ కంటైనర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో విద్యుత్ వైర్లు రహదారిపై తెగిపడ్డాయి. ఎలమంచిలి-గాజువాక ప్రధాన రహదారిలోని ఊటగెడ్డ జంక్షన్ వద్ద బుధవారం రాత్రి పదకొండున్నర గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

విశాఖ పోర్టు నుంచి బుధవారం రాత్రి భారీ కంటైనర్ మిషనరీ సామగ్రితో అచ్యుతాపురం సెజ్‌కు బయలుదేరింది. సరిగ్గా ఊటగెడ్డ జంక్షన్ వద్దకు వచ్చేసరికి అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో విద్యుత్ వైర్లు తెగిపడటంతో పాటు స్తంభం ఒక పక్కకు ఒరిగిపోయింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. లేకుంటే పెను ప్రమాదం జరిగి ఉండేది. రహదారిపై వైర్లు తెగిపడడంతో రాకపోకలు సాగించే వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు రంగంలోకి దిగి రహదారిపై తెగిపడిన వైర్లను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇదిలా ఉంటే విద్యుత్ వైర్లు తెగిపోవడం కారణంగా పరవాడ టీ రాజా హోటల్ నుంచి రావాడ పంచాయతీ పరిధి గ్రామాలన్నింటికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సిబ్బంది సుమారు 15 గంటలు పాటు శ్రమించి అనంతరం గురువారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు సరఫరాను పునరుద్ధరించారు. కాగా ప్రమాదానికి కారణమైన భారీ కంటైనర్ లారీ డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అన్నవరంలో చోరీ



అన్నవరంలో ఇంట్లో బీరువాలోని వస్తువులు పడేసిన దృశ్యం

కోటవురట్ల, జూన్ 13: మండలంలోని అన్నవరం గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు పగులగొట్టి బంగార అభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు దోచుకుపోయారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. అన్నవరం గ్రామానికి చెందిన పసుపులేటి మంగ తన ఇంటికి తాళం వేసుకుని ఈనెల 8వ తేదీ సాయంత్రం అమ్మగారి ఇంటికి కొడవటిపూడి గ్రామం వెళ్లింది. ఇంట్లో ఎవరు లేరని గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి వెనుక భాగం డోర్ తలుపులు పగలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బెడ్‌రూంలోని బీరువాను తెరిచి ముదున్నర తులాల బంగార అభణాలు, 12 తులాల వెండి ప్లేటును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ దొంగతనం ఏ రోజు జరిగిదనేది ఎవరికీ తెలియదు. బుధవారం సాయంత్రం మంగ వచ్చేసరికి ఇంటి వెనుక భాగంలో తలుపు తీసి ఉండడం గమనించి లోపలకు వెళ్లి చూడగా బీరువా తెరిచి బట్టలు చెల్ల చెదారంగా పడి ఉన్నాయి. బీరువాలో వస్తువులు పోయినట్టు గుర్తించింది. బుధవారం రాత్రి 11గంటలకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	530
విజయనగరం	534
శ్రీకాకుళం	534

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల కొరత

» మంజూరైనవి 15 పోస్టులు

» విధులు నిర్వహిస్తున్నది ఆరుగురు మాత్రమే

» కాంట్రాక్ట్, గెస్ట్ ఫ్యాకల్టీల ద్వారా విద్యా బోధన

» ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల

నర్సీపట్నం, జూన్ 13 : ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుల కొరత ఏర్పడింది. డిగ్రీ, పీజీ తరగతులు బోధించేందుకు సరిపడిన సిబ్బంది లేక విద్యార్థుల చదువులు వెనుక బడుతున్నాయి. కోర్సులు మంజూరు చేసినప్పుడు ఎంతమంది సిబ్బంది అవసరమో యూనివర్సిటీ నుంచి ప్రభుత్వానికి నివేదిక వెళుతుంది. అందుకు అనుగుణంగా పోస్టుల భర్తీ జరుగుంది. కానీ ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విషయంలో ఉన్నత విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశాలమైన కళాశాల ప్రాంగణం, ల్యాబ్‌లు, తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయి. సబ్జెక్టులు బోధించేందుకు సిబ్బంది లేక విద్యార్థుల ఉన్నత చదువులు అనుకున్నంతగా ముందుకు సాగడం లేదనే వాదన వినిపిస్తోంది.

గత ఏడాది 260 సీట్లు గాను 234 మంది విద్యార్థులు కళాశాలలో చేరారు. డిగ్రీలో బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు మేజర్ సబ్జెక్టులుగా ఉన్నాయి. అదే విధంగా పోస్ట్ గ్రాడ్యూయేట్‌లో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎంకాం కోర్సులు ఉన్నాయి. ఈ ఏడాది అదనంగా ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ కూడా అందుబాటులోకి రాబోతున్నట్టు సమాచారం. కళాశాలలో పాఠ్యాంశాల బోధనకు అధ్యాపకులు లేక విద్యార్థులు వెనుకబడుతున్నారు. డిగ్రీకి 15 మంది పర్మినెంట్ అధ్యాపకులు అవసరం కాగా ఇంగ్లీషు, తెలుగు, హిస్టరీ, పొలిటిక్స్, ఫిజిక్స్‌కి ఇద్దరు చొప్పున ఆరుగురు ఉన్నారు. కొత్తగా పర్మినెంట్ పోస్టులు భర్తీ చేయలేదు. ఇంగ్లీషు, మ్యాథ్స్ కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులకు ఒక్కొక్కరు చొప్పున ముగ్గురు కాంట్రాక్ట్ సిబ్బందిని తీసుకున్నారు.

కాంట్రాక్ట్ సిబ్బంది నియామకాలు కూడా ఆపేసి గెస్ట్ ఫ్యాకల్టీతో విద్యా బోధన చేస్తున్నారు. ఈ విధంగా ప్రభుత్వం నియమించిన గెస్ట్ ఫ్యాకల్టీ సిబ్బంది ఎకనామిక్స్‌కు ఒకరు, కామర్స్‌కు ముగ్గురు, లైబ్రేరియన్ ఒకరు ఉన్నారు. ఇంకా సిబ్బంది సరిపోక ప్రిన్సిపాల్ చొరవ తీసుకొని కళాశాల నిధుల నుంచి బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ సబ్జెక్టులకు గెస్ట్ ఫ్యాకల్టీ సిబ్బందిని నియమించుకొని పాఠాలు చెప్పిస్తున్నారు. పీజీ సబ్జెక్టులు కూడా గెస్ట్ ఫ్యాకల్టీ మీద ఆధారపడవల్సి వస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అవసరమైన సిబ్బందిని నియమించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పంచకర్ల జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే పంచకర్లకు కేక్ తినిపిస్తున్న తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రాజు, నేతలు

సబ్బవరం, జూన్ 13 : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జన్మదిన వేడుకలు పెందుర్తిలో గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పంచకర్లను సత్కరించారు. కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు తినిపించారు. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీబీవీఎస్ఎన్ రాజు ఎమ్మెల్యే పంచకర్లకు కేక్ తినిపించారు. జనసేన జిల్లా నాయకులు బలిరెడ్డి అప్పారావు స్వగృహంలో బుధవారం అర్ధరాత్రి ఎమ్మెల్యే పుట్టిన రోజులు వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు. వీర మహిళ బంతికోళ్ల పద్మ ఆధ్వర్యంలో పెందుర్తిలోని వృద్ధాశ్రమంలో అన్న సంతర్పణ నిర్వహించారు. పుట్టిన రోజు వేడుకల్లో కూటమి నేతలు ఇందలి వెంకటరమణ, సాలాపు వెంకటేశ్వరరావు, ఎం. మహాలక్ష్మీనాయుడు, దొడ్డి ప్రకాశ్, కర్రి కనకరాజు, కొటాన అప్పారావు, గొర్లి కుమార్, శరగడం రాము, పల్ల తాతారావు, కోరాడ శ్రీను, టి. శేఖర్, కేవీ రమణ, అర్జున్, కోటి రవి, దుర్గినాయుడు, బోకం స్వామినాయుడు, గండి దుర్గాప్రసద్, బలిరెడ్డి రామకృష్ణ, గొర్లి రామునాయుడు, రేసుపూడి రమణ, ఆడారి నాగరాజు, శీరం అప్పలరాజు, బర్ల మరణ, గెడ్డం రమేశ్, బలిరెడ్డి ప్రసాద్, ఆకుల గణేశ్, పోతల కనకరాజు, ఉగ్గిన రాము, గొల్ల అర్జున, జెట్ట ప్రసాద్, నెల్లి గోపాల్, కిల్లి సత్యనారాయణ, మామిడి శంకరరావు, కర్రి నరసింగరావు, ఎస్. రవి, సింగంపల్లి శ్రీను ఈ వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

జీవీఎంసీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి టౌన్, జూన్ 13: పట్టణంలోని మెయిన్‌రోడ్డులో ఉన్న జీవీఎంసీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం. వెంకటలక్ష్మమ్మ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలు ప్రారంభమైన సందర్భంగా ఆమె విద్యార్థుల ప్రార్థనా సమయంలో పాఠశాలకు వచ్చి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఉపాధ్యాయులందరూ వచ్చింది? లేనిది? ఆరా తీశారు. పాఠశాలకు వచ్చే పాఠ్యపుస్తకాలను విద్యార్థులందరికీ సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబద్ధతతో పని చేసి విద్యార్థులకు పాఠ్యాంశాలు అందించాలని సూచించారు.

మూలస్వయంభూవరంలో పీసీబీ అధికారుల పర్యటన

» సింహాద్రి కాలుష్యంపై చర్యలు తీసుకుంటామని వెల్లడి


'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



గ్రామస్థులతో మాట్లాడుతున్న పీసీబీ అధికారులు

పరవాడ, జూన్ 13 : కలపాక పంచాయతీ పరిధి మూలస్వయంభూవరంలో గురువారం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ) అధికారులు పర్యటించారు. గ్రామానికి ఆనుకుని ఉన్న సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు కారణంగా తీవ్ర కాలుష్యం వెదజల్లడంతో పాటు గ్రామస్థులు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇదే విషయమై 'వెలుగుల మాటున చీకట్లు' శీర్షికతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. దీనిలో భాగంగా పీసీబీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఈఈ) పీవీ ముకుందరావు, ఏఈ మూర్తి సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించారు. సింహాద్రి కాలుష్యం కారణంగా ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అక్కడి నుంచి శాంపిల్స్ సేకరించారు. సింహాద్రి కాలుష్యంపై చర్యలు తీసుకుంటామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. గ్రామంలో మోనటరింగ్ మిషన్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యానికి నోటీసులు ఇస్తామని ఈఈ ముకుందరావు తెలిపారు. అలాగే గ్రామంలో పొల్యూషన్‌కు సంబంధించి సేకరించిన వివరాల నివేదికను 15 రోజుల్లోగా తెలియజేస్తామని వెల్లడించారు. పీసీబీ అధికారుల వెంట స్థానిక నాయకులు కొత్తపల్లి బాబూరావు, కాలపురెడ్డి సురేష్, మరిసా రవి పాల్గొన్నారు.

అయ్యన్నతో అనిత భేటీ



విజయవాడలో అయ్యన్నపాత్రుడికు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి అనిత

కోటవురట్ల, జూన్ 13: మాజీ మంత్రి, నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడుతో పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత మంత్రిగా ప్రమాణం చేసిన తర్వాత విజయవాడలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె అయ్యన్నపాత్రుడును సత్కరించి, ఆశీస్సులు తీసుకున్నారు. మంత్రిగా చేపట్టిన అనితకు అయ్యన్నపాత్రుడు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం మంత్రి అనిత మాట్లాడుతూ తన కంటే సీనియర్లు సలహాలు, సూచనలతో విశాఖ ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఈ భేటీలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, మంత్రి అనిత తనయుడు పాల్గొన్నారు.

మంత్రి అనితను కలిసిన టీడీపీ నాయకులు



మునగపాక (తుమ్మపాల), జూన్ 13: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేపట్టిన వంగలపూడి అనితను గురువారం తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు ఆడారి మంజు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భం గా దుశ్శాలువాలను కప్పి పూలమాలలతో సత్కరించారు. టీడీపీ బలోపేతానికి సహకారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



విజయవాడ దుర్గమ్మ ఆలయంలో మంత్రి అనితకు అమ్మవారి చిత్రపటం అందిస్తున్న ఆలయ అధికారులు

పవన్‌కల్యాణ్‌కు గెడ్డం బుజ్జి అభినందన



పవన్‌కల్యాణ్‌ని సత్కరించిన గెడ్డం బుజ్జి

పాయకరావుపేట, జూన్ 13 : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా గురువారం బాధ్యతలు చేపట్టిన జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు ఆ పార్టీ పాయకరావుపేట ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి అభినందనలు తెలియజేశారు. గురువారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ని గెడ్డం బుజ్జి శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ జనసేన ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ కష్టకాలంలో పార్టీకి అండగా ఉన్న గెడ్డం బుజ్జికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ని కలిసి గెడ్డం బుజ్జి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట గెడ్డం చైతన్య, జగ్గన్నదొర, ఏవీ.సూర్యనారాయణ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సబ్బవరం, జూన్ 13 : సబ్బవరం 33/11కేవీ సబ్ స్టేషన్, అంతకాపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ ఆయా పరిధిలోని గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మంత్రి అనితకు ఘన స్వాగతం పలుకుదాం

» టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు

పాయకరావుపేట, జూన్ 13 : రాష్ట్ర మంత్రి వంగలపూడి అనిత నేతృత్వంలో పాయకరావుపేట అభివృద్ధికి సమిష్టి కృషి చేద్దామని టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మండల పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అనితకు రాష్ట్ర మంత్రిగా అవకాశం ఇచ్చినందుకు సీఎం చంద్రబాబునాయుడికు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రానున్న రోజుల్లో మంత్రి అనిత ఆధ్వర్యంలో పాయకరావుపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు సమిష్టిగా కృషిచేద్దామన్నారు. అదేవిధంగా రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారిగా శనివారం నియోజకవర్గానికి వస్తున్న వంగలపూడి అనిత పాయకరావుపేటలో ఘనంగా స్వాగతం పలికేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు, అభిమానులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, పార్టీ నాయకులు గొర్రెల రాజబాబు, యాళ్ల వరహాలబాబు, బొంది కాశీవిశ్వనాథం, కంకిపాటి వెంకటేశ్వరరావు, మజ్జూరి నారాయణరావు, గూటూరు శ్రీనివాసరావు, చిక్కాల శ్రీను, చింతకాయల రాంబాబు, జూరెడ్డి ప్రసాద్, పల్లా విలియంకేరి, గారా కృష్ణప్రసాద్, ఎం.రమాకుమారి, వేములపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాను

» టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు

కోటవురట్ల, జూన్ 13: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు ఏ సమయంలో ఇబ్బంది వచ్చినా తాను అండగా ఉంటానని టీడీపీ మండల అధ్యక్షుడు జానకి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం ఆయన నివాసం వద్ద ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. టీడీపీకి గతంలో ఎన్నడూ మండలంలో ఈ మెజారిటీ రాలేదన్నారు. ఈసారి జరిగిన ఎన్నికల్లో వంగలపూడి అనితకు పట్టం కట్టారని, ఇదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేయాలన్నారు. శనివారం మంత్రి హోదాలో అనిత నియోజకవర్గానికి వస్తున్న సందర్భంగా పాయకరావుపేటలో స్వాగతం పలకేందుకు ప్రతి గ్రామం నుంచి వంద మంది తక్కువ కాకుండా తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో మండల సీనియర్ నాయకులు వేచలపు జనార్దన్, సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ, తిరుమలరావు, సుంకర్ బాబ్జీ, పినపాత్రుని బాబ్జి, యండపల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జానకి శ్రీనివాసరావు

హరిపురంలో టీడీపీ సంబరాలు



రంగనాయకులను సత్కరించిన టీడీపీ నేతలు, కార్యకర్తలు

రాంబిల్లి, జూన్ 13 : రాష్ట్రంలో ఎన్‌డీఏ కూటమి అఖండ విజయం సాధించి, ముఖ్యమంత్రిగా నాల్గోసారి నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా గురువారం హరిపురంలో సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు పాలన శుభప్రదం కావాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ధూళి రంగనాయకులు కేక్ కట్ చేసి అందరికీ పంచారు. అనంతరం రంగనాయకులును టీడీపీ శ్రేణులు సత్కరించాయి. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడుతూ వైసీపీ రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగిందని, చంద్రబాబు పాలనలో ప్రజలకు అన్నివిధాల సుభిక్షంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ధూళి రమణ, ధూళి అప్పారావు, కోన అప్పలనాయుడు, దేవర శ్రీను, పైడిరాజు, సన్యాసిరావు, తెలుగు యువత సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధి హామీకి బడ్జెట్‌లో నిధులు పెంచాలి

» సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రాము డిమాండ్



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రాము

అచ్యుతాపురం, జూన్ 13: గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు పెంచి మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. గురువారం తిమ్మరాజుపేటలో జరిగిన ఉపాధి కూలీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు పెంచి సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. అంతేకాక రోజు కూలీ రూ.600 ఇవ్వాలన్నారు. ఏ రోజుకి ఎంత కూలీ వస్తుందో గతంలో ఇచ్చే విధంగా పే స్లిప్‌లు ఇవ్వాలని కోరారు. కూలీలు పనిచేస్తున్న స్థలాల్లో నీడకు టెంట్, మంచినీరు, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శరగడం రామునాయుడు, శ్రీనివాసరావు, తిరుపతమ్మ, కోదండమ్మ, రామలక్ష్మి పాల్గొన్నారు

పంచకర్లకు జన్మదిన శుభాకాంక్షలు



పంచకర్లకు గజమాల వేసి శుభాకాంక్షలు చెబుతున్న ఎలమంచిలి కూటమి నేతలు

ఎలమంచిలి, జూన్ 13 : పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేశ్ బాబును గురువారం ఎలమంచిలి నియోజకవర్గానికి చెందిన పలువురు కూటమి నేతలు పెందుర్తిలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు టీడీపీ నాయకులు కాంద్రకోట చిరంజీవి, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, నగిరెడ్డి శ్రీను తదితరులు గజమాలతో సత్కరించారు. పుష్పగుచ్ఛాలిచ్చి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎలమంచిలి ఎమ్మెల్యేగా పంచకర్ల చేసిన సేవలు ఇప్పటికీ మరువలేనివని కాంద్రకోట చిరంజీవి అన్నారు. వారితో పాటు నగిరెడ్డి కాసుబాబు, మోహన్ కలిశారు.



జనసేన నాయకులు బలిరెడ్డి అప్పారావు స్వగృహంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పుట్టిన రోజు కేక్ కట్ చేస్తున్న దృశ్యం -సబ్బవరం

అచ్చెన్నాయుడుకు అభినందనలు



అచ్చెన్నాయుడుకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

తుమ్మపాల, జూన్ 13 : రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన కింజరాపు అచ్చెన్నాయుడును గురువారం మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, విశాఖ జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేసి దుశ్శాలువాలను కప్పి సత్కరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధికి నడిపించడంతో పాటు పార్టీ శ్రేణులకు అండగా నిలవాలని వారంతా కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దాడి బుజ్జి, రామారావు, యల్లపు శ్రీనివాసరావు, పి. సురేష్, వేగి కృష్ణ భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్త మహాలక్ష్మి పండగ

మునగపాక (తుమ్మపాల),జూన్ 13 : మండల కేంద్రంలోని కొత్త మహాలక్ష్మి అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు కర్రి సాయికృష్ణ, పెంటకోట విజయ్, దాడి మునిలినాయుడు, దాడి శివ, పలువురు టీడీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను చేశారు. తెల్లవారు జాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి మొక్కులు, ముడుపులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాడి శివ, బుద్ద వెంకట్, దాడి అప్పలనాయుడు, వి. సాయిరాం, కె. వరదేశిరావు, బీలా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల అనుపోత్సవం

సబ్బవరం, జూన్ 13 : మండల కేంద్రంలోని జోడగుళ్ల, గొర్లివానిపాలెంల్లో కొలువైన గ్రామ దేవతలు కుంచాలమ్మ, బంగారమ్మ అమ్మవార్ల అనుపోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచే భక్తులు పూజలు చేశారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ, మధ్యాహ్నం నుంచి సాముగరిడీలు, కోలాటం, చిటికెల భజనలు, మందుగుండు సామగ్రి, నేల డ్యాన్స్‌లతో అమ్మవారి అనుపోత్సవం నిర్వహించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

మెగా డీఎస్సీపై సంతకం

... 5వ పేజీ తరువాయి

ఖాళీలు ఎన్ని అనేది తెలుస్తుందని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. అయితే ఈ పర్యాయం జిల్లాలో పోస్టుల సంఖ్య ఎక్కువగానే ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేస్తున్నాయి. ఈ ఏడాది చివరి వరకు ఏర్పడే ఖాళీలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు టీచర్, విద్యార్థి నిష్పత్తిని సవరిస్తే నిరుద్యోగులకు మేలు జరుగుతుందని అంటున్నారు. ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ ఇస్తానని చెప్పిన చంద్రబాబునాయుడు అందుకు తగిన విధంగా ఎక్కువ పోస్టులు భర్తీ చేయబోతున్నారని సీనియర్ టీచర్ ఒకరు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విభజన తరువాత రెండు పర్యాయాలు డీఎస్సీలు నిర్వహించారు. అయితే ఇప్పుడు ప్రకటించినన్ని పోస్టులు గతంలో ఎన్నడూ భర్తీచేయలేదని నిరుద్యోగులు అంటున్నారు. ఐదేళ్ల నుంచి అనేక పోరాటాలు చేసినా జగన్ ప్రభుత్వం కనీసం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం చంద్రబాబునాయుడు సంతకం చేసిన నేపథ్యంలో త్వరలోనే డీఎస్సీ ప్రకటన వెలువడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సాగునీటికి ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే చినరాచపల్లి రిజర్వాయరు గేట్లు మూడేళ్ల కిందటే పాడైపోయాయి. ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో నీరు నిల్వ ఉండని పరిస్థితి. రైతులకు అండగా నిలవాల్సిన సాగునీటి ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేయడంతో దేవుడిపై భారం వేసి పంటలను సాగు చేయాల్సిన దుస్థితి నెలకొందని, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించడంతో సాగునీటి వనరులకు మహర్దశ పడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా పడుతున్న ఇబ్బందులు తొలగుతాయని అంచనా వేస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలలో శ్రమదానం



పాఠశాలలో శ్రమదానం చేస్తున్న అప్పలరాజు, తదితరులు

ఎస్.రాయవరం, జూన్ 13: మండలంలోని ధర్మవరం అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో ఆ గ్రామానికి చెందిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. అప్పలరాజు ఆధ్వర్యంలో స్థానికులు గురువారం ఉదయం శ్రమదానం చేసి పేరుకుపోయిన తుప్పలను తొలగించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పాఠశాల ఆవరణలో తుప్పలు పెరిగాయని, వాటి వల్ల పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో శ్రమదానం చేపట్టినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వార్డు మెంబరు నీలం హేమ రమణ, మాజీ వార్డు మెంబరు డాక్టర్ కోసూరు సత్యనారాయణ, పలువురు యువకులు పాల్గొన్నారు.

నీటి వనరుల సద్వినియోగంపై అవగాహన



ఉద్దండపురం హైస్కూల్‌లో నీటి వనరుల సద్వినియోగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి, జూన్ 13: మండలంలోని ఉద్దండపురం హైస్కూల్‌లో గురువారం నీటి వనరుల సద్వినియోగంపై అవగాహన సదస్సు ప్రారంభమైంది. హెచ్‌ఎం డి. సత్యారావు ఆధ్వర్యంలో పాఠశాల ఎకో క్లబ్ నేతృత్వంలో వారం రోజుల పాటు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సత్యారావు మాట్లాడుతూ.. నిత్య జీవనంలో నీరు వృథా కాకుండా ప్రతీ నీటి బొట్టు ఒడిసి పట్టాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని సూచించారు. సేవ్ వాటర్ ఎనర్జీ యాక్టివిటీస్ కార్యక్రమాలు విద్యార్థులతో నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్ వేలంశెట్టి శ్రీను, పాలూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ జాతర



దుర్గాలమ్మ అమ్మవారిని దర్శిస్తున్న దిన్‌బాబు, కె.లక్ష్మినాగరత్నం

రాంబిల్లి, జూన్ 13 : మండలంలోని పంచదార్లలో గురువారం దుర్గాలమ్మ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి, పూజలు చేశారు. నిర్వాహకులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. దుర్గాలమ్మ అమ్మవారిని టీడీపీ మండల అధ్యక్షుడు వి.దిన్‌బాబు, మాజీ ఎంపీపీ వి.లక్ష్మినాగరత్నం తమ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించారు.

ప్రారంభానికి నోచుకోని స్వయం సహాయక సమాఖ్య భవనం



నిర్మాణం చేపట్టిన స్వయం సహాయక గ్రూపుల సమాఖ్య భవనం ఇదే

రాంబిల్లి, జూన్ 13 : మండల కేంద్రంలో నిర్మించిన స్వయం సహాయక గ్రూపుల సమాఖ్య భవనం ఏళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. 2017లో ఉపాధి పథకం నిధులు రూ.10 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ భవన నిర్మాణానికి అప్పటి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణం పూర్తయి ఆరేళ్లు అవుతున్నా నేటికీ ప్రారంభించలేదు. దీంతో భవనం చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాన్ని ప్రారంభించకపోవడంతో పాడై పోయే పరిస్థితి ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే మండల కేంద్రంలో నిర్మించిన పశువుల ఆసుపత్రి భవనం, దుకాణ సముదాయం, బస్‌షెల్టర్లు నేటికీ ప్రారంభానికి నోచుకోక శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా ఉన్నాయి. ఆ జాబితాలో స్వయం సహాయక గ్రూపుల సమాఖ్య భవనం చేరకుండా సంబంధిత అధికారులు వెంటనే ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

'హైందవ ధర్మాన్ని అందరూ పాటించాలి'



అప్పన్నపాలెంలో ధర్మప్రచారం నిర్వహిస్తున్న భక్తులు

రాంబిల్లి, జూన్ 13: హైందవ ధర్మాన్ని అందరూ పాటించాలని సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ ధర్మప్రచారకులు కొల్లి అప్పారావు కోరారు. గురువారం అప్పన్నపాలెంలో ఇంటింట ధర్మప్రచారాన్ని నిర్వహించి, ఇళ్లకు స్టిక్కర్లు అంటించి, కరపత్రాలను భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన హిందూ ధర్మం గొప్పతనాన్నివిలువలను భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు శెశెట్టి అప్పారావు, లాలం సన్యాసిరావు, లాలం రాజు, రెడ్డి భవాని, లాలం పద్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలో వరి విత్తనాలు సిద్ధం



రైతు భరోసా కేంద్రంలో ఉన్న వరి విత్తనాలు

ఎస్. రాయవరం, జూన్ 13: మండలంలోని అన్ని గ్రామాల రైతులకు కావాల్సిన వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, మండల వ్యవసాయ అధికారిణి సౌజన్య గురువారం ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్‌కు అవసరమయ్యే ఆర్‌జీఎల్ వరి విత్తనాలు 1052 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం విత్తనాలు 86 క్వింటాళ్లు, ఎమ్‌టీయూ 1061 రకం 67 క్వింటాళ్లు, ఎమ్‌టీయూ 1318 రకం 9 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వరి విత్తనాలు కావల్సిన రైతులందరూ ఆర్‌బీకేల్లో వివరాలను నమోదు చేసుకోవాలని సౌజన్య సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి టౌన్, జూన్ 13 : పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈపీడీసీఎల్ ఈఈ కె. రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఎస్‌ఎల్‌ఎన్ నగర్, 11కేవీ ఉడ్‌పేట, 11కేవీ గవరపాలెం, 11 కేవీ గాంధీమార్కెట్, 11కేవీ పూల్‌బాగ్, 11 కేవీ నూకాంబిక కోల్డ్ స్టోరేజ్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు సబ్‌స్టేషన్ నిర్వహణ పనులు చేస్తుండడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఆయన తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న దొరబాబు

తుమ్మపాల, జూన్ 13 : ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి రాజాన దొరబాబు కోరారు. గురువారం ఊడేరులో ఉపాధి కూలీలను కలిసి మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఉపాధి కూలీలకు 200 రోజుల పనిదినాలను కల్పించాలన్నారు. రోజుకు రూ.600లు చొప్పున వేతనాలను చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసే కుట్రలో భాగంగా బడ్జెట్‌లో కోతలు విధిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు నరాలశెట్టి సత్యనారాయణ, ఉపాధి కార్మికులు సాయికుమారి, వెంకటలక్ష్మి, భవాని, గౌరీ, గౌరీదేవి, శివలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా రోలుగుంట- చోడవరం రోడ్డు

▸▸ చిన్నపాటి వర్షానికే ఎక్కడికక్కడ నిలిచిపోతున్న నీరు
▸▸ రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
▸▸ గత ఐదేళ్లుగా పట్టించుకునేవారు లేకపోవడంతో మరింత దారుణం


రోలుగుంటలో అధ్వానంగా ఉన్న బీఎన్ రోడ్డు

రోలుగుంట, జూన్ 13 : గత ఐదేళ్ల వైసీపీ సర్కారు నిర్లక్ష్యం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా మారాయి. ఎక్కడికక్కడ రాళ్లు తేలి, గుంతలు పడినా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. ఫలితంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని రోలుగుంట- చోడవరం రోడ్డు దుస్థితి మరీ దారుణంగా ఉంది. ఎక్కడ చూసినా అస్తవ్యస్తంగానే కనిపిస్తోంది. మండల కేంద్రం రోలుగుంట తహసీల్దార్ కార్యాలయం సమీపంలో బీఎన్ రోడ్డుపై చిన్నపాటి వర్షానికే చెరువును తలపించేలా నీరు నిలిచిపోతుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో వాహనదారులు, కార్యాలయానికి వచ్చేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలో చాలా రోడ్ల పరిస్థితి ఇదే మాదిరిగా ఉన్నా పట్టించుకునేవారు లేకపోయారు. గతంలో పలుమార్లు క్రషర్ బుగ్గిని పైపై కప్పి మరమ్మతులు చేపట్టినా మూన్నాళ్లకే సమస్య మళ్లీ మొదటికి వస్తోందని పలువురు వాపోతున్నారు. ప్రస్తుతం అసలే వర్షాకాలమని, గుంతల్లో నీరు నిలిస్తే ప్రమాదాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాల్సిందిగా కోరుతున్నారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీ గూటికి

▸▸ లోవపొన్నవోలు ఉప సర్పంచ్, ముగ్గురు వార్డు సభ్యులు చేరిక

మాడుగుల రూరల్, జూన్ 13 : మండలంలోని లోవపొన్నవోలు గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం టీడీపీలో చేరారు. గ్రామ ఉప సర్పంచ్ గంటమల్ల చిన్నతల్లి, వార్డు సభ్యులు రాజాన పైడితల్లి, కోన చిలుకమ్మ, మల్లారపు నూకాలమ్మతో పాటు గంటమల్ల దేముడబ్బాయి, రాము, కొండబాబు, నగేశ్, సోమరాజు, వీరందొర తదితరులు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు యన్నంశెట్టి సత్యారావు, గండిపడాల సంతోష్, పాము సూరిదేముడు, గణేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మోదకొండమ్మ జాతరకు పక్కా ఏర్పాట్లు

▸▸ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి ▸▸ భక్తులకు అసౌకర్యాలు తలెత్తరాదు ▸▸ అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే 'బండారు'



జాతర ఏర్పాట్లపై అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

మాడుగుల, జూన్ 13 : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత మాడుగుల మోదకొండమ్మ జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేలా అంతా సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. ఈ నెల 18వ తేదీన అమ్మవారి వేడుక జరగనున్న నేపథ్యంలో గురువారం ఇక్కడ ఆలయ చైర్మన్ పప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమావేశాన్ని నిర్వహించారు. పారిశుధ్యం, తాగునీరు, ట్రాఫిక్, విద్యుత్, రవాణా తదితర పలు కీలక శాఖల అధికారులతో మాట్లాడారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వైద్య సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలకు మరుగుదొడ్లు, టాయిలెట్ల సదుపాయం పక్కాగా ఉండాలని వివరించారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులకు సూచించారు. పండగనాడు అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే వీఐపీలు మళ్లీ వెనక్కి రాకుండా వయా కోడూరు మీదుగా పంపించాలని పోలీసులకు ఆదేశించారు. అంతకుముందు ఆయన మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టీడీపీ నాయకుడు పైలా ప్రసాదరావు, డీపీవో ఆర్. శిరీషారాణితో పాటు వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలపై కమిషనర్‌కు వినతి


వినతిపత్రం అందిస్తున్న సంఘం ప్రతినిధులు

నర్సీపట్నం, జూన్ 13 : అపరిష్కృతంగా ఉన్న మునిసిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా మునిసి పల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కమిషనర్ పూడి రవిబాబుకు వినతి పత్రం అందజేశారు. పారిశుధ్య కార్మికుల కనీస వేతనాలు పెంచాలని, మునిసిపాలిటీ జనాభా ప్రాతిపదికన సిబ్బందిని పెంచాలని కోరారు. చాలా కాలంగా పెడింగ్‌లో ఉన్న అన్ని సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం అధ్యక్షుడు వేమగిరి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ కుమార్, అక్కునాయుడు తదతరులు పాల్గొన్నారు.

వీరవిల్లి అగ్రహారంలో మోదకొండమ్మకు సారె

▸▸ 101 రకాల పిండివంటకాలతో ఊరేగింపుగా వెళ్లి సమర్పించిన గ్రామస్థులు


అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకు వెళుతున్న గ్రామస్థులు

మాడుగుల రూరల్, జూన్ 13 : మండలంలోని వీరవిల్లి అగ్రహారంలో కొలువుదీరిన మోదకొండమ్మకు గురవారం గ్రామస్థులు సారెను ఘనంగా సమర్పించారు. సుమారు 101 రకాల పిండి వంటలు, పుసుపు కుంకుమ, చీరలు, కొబ్బరికాలయలు, అరటిపండ్లు తదితరాలతో ప్రతి ఇంటి నుంచి ఆలయానికి ఊరేగింపుగా బయల్దేరారు. గురుభవానీ పాలకుర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పీఠంలోని మాలధారణ చేసిన భక్తులు అంతా కలిసి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం అక్కడ అమ్మవారికి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామంలో కోలాహల వాతావరణం నెలకొంది.

గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనాలపై 'బూడి' పేరు తొలగించాలి

కార్యదర్శికి కూటమి నాయకులు వినతి


కార్యదర్శికి వినతిని అందిస్తున్న కూటమి నాయకులు

మాడుగుల రూరల్, జూన్ 13 : ఎం.కోడూరులో గల గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలపై మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు పేరును తొలగించాలని స్థానిక టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం సచివాలయం కార్యదర్శికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై నాయకుల పేర్లు ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే సదరు పేరును తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గట్టా రామారావు, ఎం.వరహామూర్తి, రాము, రమేశ్, కొండలరావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి ప్రభావతి రాజీనామా


గొల్లవిల్లి ప్రభావతి

మాడుగుల రూరల్, జూన్ 13 : తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి గొల్లవిల్లి ప్రభావతి గురువారం రాజీనామా చేశారు. మండలంలోని ఎం.కోడూరుకు చెందిన ఈమె వైసీపీ అధికారంలో ఉండగా, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆశీస్సులతో ఈ పదవికి ఎంపికయ్యారు. తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నిల్లో ఆ పార్టీ ఓటమి పాలు కావడంతో తన రాజీనామా పత్రాన్ని జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌కు అందజేశారు.

చౌడువాడలో అమ్మవార్ల వేడుక


భక్తుల పూజలందుకున్న మరిడిమాంబ

కె.కోటపాడు, జూన్ 13 : చౌడువాడలో మరిడిమాంబ, బంగారమ్మతల్లి పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే బండారుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేష్, విశాఖ ఉమ్మడి జిల్లా సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తకోటలో రాధాకృష్ణులకు విశేష పూజలు


పూజల్లో టీడీపీ నాయకురాలు నీలవేణి తదితరులు

రావికమతం, జూన్ 13 : మేజర్ పంచాయతీ కొత్తకోటలో రాధాకృష్ణుల ఆలయ ఐదో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కమిటీ ప్రతినిధి ఉండా అచ్చిబాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో టీడీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి, టీడీపీ నాయుకులు కోట గోవిందరావు, సత్యనారాయణ, ఉగ్గిన శ్రీను, శంకరావు, వెల్లంకి ఈశ్వరరావు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాలు

చీడికాడ, జూన్ 13 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్నామని ఎంఈవోలు కె.బొంజుబాబు, బీవీ రమణ తెలిపారు. ఎనిమిది, తొమ్మిది, పది తరగతులకు పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు రాగా, ఒకటి నుంచి ఏడో తరగతి వరకు కొంతమేర వచ్చాయన్నాయి. మిగిలినవి రెండు మూడు రోజుల్లో రానున్నట్టు చెప్పారు. త్వరలో అన్ని పాఠశాలలకు వీటిని అందజేయడం జరుగుతుందని వివరించారు. ఉపాధ్యాయులు విధిగా సమయ పాలన పాటించాలని సూచించారు.

అధిక ఫీజులపై ఏఐఎస్ఎఫ్ ఆందోళన



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సభ్యులు ఆందోళన

నర్సీపట్నం అర్బన్, జూన్ 13 : పట్టణంలోని కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ నర్సీపట్నం ప్రాంతంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. అంతేకాకుండా నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాలు, యూనిఫాం వంటి వాటితో విద్యార్థుల తల్లిదండ్రులపై మరింత భారం మోపుతున్నారన్నారు. వీటిపై గతంలో మండల విద్యాశాఖాధికారికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. తక్షణమే ఈ సమస్యపై స్పందించాల్సిందిగా వారు కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో పలువురు ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లపై ఆకతాయిల కన్ను

▸▸ పగటి వేళ పొలాల్లో సంచరించి గుర్తింపు
▸▸ రాత్రి వేళ కట్ చేసి దొంగిలింపు
▸▸ లబోదిబోమంటున్న పలువురు అన్నదాతలు

నాతవరం, జూన్ 13 : వ్యవసాయ మోటర్ల కేబుల్ వైర్లపై చిల్లర దొంగల కన్ను పడుతుండడంతో పలువురు అన్నదాతలు లబోదిబోమంటున్నారు. మండలంలోని వెదురుపల్లి, గుమ్మిడిగొండ తదితర గ్రామాల్లో పొలాల్లో ఉన్న వ్యవసాయ మోటర్ల కేబుల్ వైర్లను గత వారం రోజుల నుంచి కొందరు ఆకతాయిలు కట్‌చేసి పట్టుకుపోతున్నారు. వర్షా కాలం ఆరంభమైనా ప్రస్తుతం ఎండల తీవ్రత తగ్గక పోవడంతో పంటలకు వ్యవసాయ మోటర్ల ద్వారా ఆయా రైతులు నీరు అందిస్తున్నారు. వేకువనే రైతులు నిద్రలేచి తమ పొలాల్లోని పంటలకు నీరు విడిచిపెట్టేందుకు వెళుతుండడం, తీరా అక్కడ చూసేసరికి కేబుల్ వైర్లు కట్‌చేసి ఉంటుండడంతో ఏం చేయాలో తెలియని స్థితిలో ఉంటున్నారు. పగటి వేళలలో రైతులు పొలంలో లేని సమయంలో కొందరు ఎక్కడ వ్యవసాయ మోటర్లు ఉన్నాయో పలువురు గుర్తిస్తున్నారు. రాత్రి వేళ అక్కడికి వెళ్లి ఆయా కేబుల్ వైర్లను పట్టుకుపోతున్నారు. ఇటువంటి ఆకతాయిల ఆటలను ఆది లోనే పోలీసులు కట్టడి చేయాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో ఇటువంటి చోరీలు మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు.

ఖరీఫ్‌కు వరి విత్తనాలు సిద్ధం


చీడిగుమ్మల ఆర్‌బీకేలో సిద్ధంగా ఉన్న విత్తనాలు

గొలుగొండ, జూన్ 13 : రైతు భరోసా కేంద్రాల్లో వరి విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచినట్టు మండల వ్యవసాయాధికారిణి సుధ తెలిపారు. ఆర్‌జీఎల్, 1064, సాంబమసూరి, తెలంగాణ సన్నాలు వంటి రకాలను జోగంపేట, గొలుగొండ, గుండుపాల, చీడిగుమ్మల, ఏటిగైరంపేట, కొత్తమల్లంపేట, పాతమల్లంపేట గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతులు తమ ఆధార్ కార్డుతో ఆన్‌లైన్ చేయించుకుని, విత్తనాలు పొందాలని సూచించారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలు


అమ్మవారికి భక్తుల పూజలు


కొంగసింగిలో ఎడ్లబండ్ల పరుగు పోటీ జరుగుతున్న దృశ్యం

కృష్ణాదేవిపేట, జూన్ 13 : గొలుగొండ మండలం కొంగసింగిలో మరిడిమాంబ పండగను గురువారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. గ్రామంలో రెండు మరిడిమాంబ ఆలయాలు ఉండగా, భక్తులు ఈ రెండుచోట్ల పుసుపు కుంకుమలతో పాటు పలువురు తలనీలాలను సమర్పించారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. రాత్రి అమ్మవారి గరగలను మేళతాళాలు బాజా భజంత్రీలతో ఊరేగించారు. సర్పంచ్ యలమంచిలి నూకతర్నం, మాజీ సర్పంచ్ చెల్లూరి సత్యనారాయణ, యలమంచిలి వరహాలబాబు, మాజీ ఎంపీటీసీ లగుడు శ్రీను, జనసేన నాయకులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఈ పండగను పురస్కరించుకుని గురువారం సాయంత్రం జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పరుగు పోటీలను నిర్వహించారు. సర్పంచ్ యలమంచిలి నూకరత్నం, టీడీపీ నాయకుడు యలమంచిలి వరహాలబాబు తదితర పెద్దల ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో సుమారు 18మంది ఎడ్ల బండ్లతో అనకాపల్లి, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి జిల్లాల నుంచి వచ్చి పాల్గొన్నారు. ప్రథమ బహుమతిని లెక్కవానిపాలేనికి చెందిన పైడితల్లమ్మతల్లి, ద్వితీయ బహుమతిని కేఎల్‌బీ పట్నానికి చెందిన బండారు హేమతేజ, తృతీయ బహుమతిని అర్జునగిరికి చెందిన పరవాడ నాయుడుకు చెందిన బండ్లు గెలుపొందడంతో వీరికి నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశారు. ఈ పోటీల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కృష్ణాదేవిపేట ఎస్ఐ ఉపేంద్ర బందోబస్తు నిర్వహించారు.

గ్రామాల్లో మలేరియాపై అవగాహన ర్యాలీ



జె.బెన్నవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కొత్తకోట వైద్య సిబ్బంది, గ్రామస్థులు

రావికమతం, జూన్ 13 : మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా జె.బెన్నవరంలో గురువారం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తకోట పీహెచ్‌సీ వైద్యాధికారిణి రజనీ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు, మలేరియా ప్రబలే ప్రమాదం ఉందన్నారు. వీటిపై అంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా నివాస ప్రాంతాల్లో వర్షపు నీరు, మురుగు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. దోమ కాటు బారిన పడకుండా దోమ తెరలను వినియోగించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి మోహినిసురేఖ, ఆరోగ్య విస్తరణాధికారి పాతాళ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

చీడికాడ : మలేరియా మాసోత్సవాల్లో భాగంగా గురువారం బైలపూడి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెదగోగాడ పీహెచ్‌సీ వైద్యాధికారి తరణి మాట్లాడుతూ జూన్ నుంచి అక్టోబర్ వరకూ సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ఈ ఐదు నెలు ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా దోమ కాటుకు గురికాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పలువురికి మందులు అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


బైలపూడి గ్రామంలో...

బూరుగుపాలెం పాఠశాల విద్యార్థిని ప్రతిభ

మాకవరపాలెం, జూన్ 13 : బూరుగుపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌నకు ఎంపికైంది. పాఠశాలలో ఎనిమిదోవ తరగతి చదువుతన్న ఎస్. సాయిప్రణతి ఇటీవల జరిగిన పరీక్షలో ప్రతిభ చూపడంతో స్కాలర్‌షిప్ పొందేందుకు అర్హత సాధించిందని ఎంఈవో మూర్తి తెలిపారు. ఈమెకు తొమ్మిదో తరగతి నుంచి నాలుగు సంవత్సరాల పాటు ఏడాదికి రూ.12వేలు చొప్పున ఆర్థిక సాయం అందనుందన్నారు. ఈ సందర్భంగా ఆమెనుపాఠశాలు ఉపాధ్యాయులు అభినందించారు.

మెగా డీఎస్సీపై సంతకం

... 5వ పేజీ తరువాయి

ఖాళీలు ఎన్ని అనేది తెలుస్తుందని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. అయితే ఈ పర్యాయం జిల్లాలో పోస్టుల సంఖ్య ఎక్కువగానే ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేస్తున్నాయి. ఈ ఏడాది చివరి వరకు ఏర్పడే ఖాళీలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు టీచర్, విద్యార్థి నిష్పత్తిని సవరిస్తే నిరుద్యోగులకు మేలు జరుగుతుందని అంటున్నారు. ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ ఇస్తానని చెప్పిన చంద్రబాబునాయుడు అందుకు తగిన విధంగా ఎక్కువ పోస్టులు భర్తీ చేయబోతున్నారని సీనియర్ టీచర్ ఒకరు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర విభజన తరువాత రెండు పర్యాయాలు డీఎస్సీలు నిర్వహించారు. అయితే ఇప్పుడు ప్రకటించినన్ని పోస్టులు గతంలో ఎన్నడూ భర్తీచేయలేదని నిరుద్యోగులు అంటున్నారు. ఐదేళ్ల నుంచి అనేక పోరాటాలు చేసినా జగన్ ప్రభుత్వం కనీసం స్పందించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం చంద్రబాబునాయుడు సంతకం చేసిన నేపథ్యంలో త్వరలోనే డీఎస్సీ ప్రకటన వెలువడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సాగునీటికి ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే చినరాచపల్లి రిజర్వాయరు గేట్లు మూడేళ్ల కిందటే పాడైపోయాయి. ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో నీరు నిల్వ ఉండని పరిస్థితి. రైతులకు అండగా నిలవాల్సిన సాగునీటి ప్రాజెక్టులను వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేయడంతో దేవుడిపై భారం వేసి పంటలను సాగు చేయాల్సిన దుస్థితి నెలకొందని, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించడంతో సాగునీటి వనరులకు మహర్దశ పడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్లుగా పడుతున్న ఇబ్బందులు తొలగుతాయని అంచనా వేస్తున్నారు.